సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 18 । జూన్ । 2023



నాన్నే నా హీరో!
జీవితంతో విడదీయలేని బంధం నాన్న. ఆయన లేని మన పుట్టుకను, జీవితాన్ని ఊహించుకోలేం. తల్లితో కలిసి బిడ్డల అభివృద్ధికి పడే తపనను వర్ణించలేం. - 8లో



రైతులకు నాణ్యమైన సేవలందించాలి
రైతులకు నాణ్యమైన సేవలను అందించాలని ఏపీ సూక్ష్మ సేద్య సాగు పథక జిల్లా ప్రాజెక్టు అధికారి సూచించారు. - 8లో



వైఎస్సార్ పశు బీమా చేసుకోండి
పశువులు, ఆవులు కలిగిన రైతులు పశుబీమా చేయించుకోవాలని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

తిరువణ్ణామలైకి ప్రత్యేక సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప ఆర్టీసీ రీజియన్ పరిధిలోని వివిధ డిపోల నుంచి జులై 2వ తేది అరుణాచల గిరి ప్రదక్షిణ కోసం తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని జిల్లా ప్రజారవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప డిపో నుంచి సూపర్ లగ్జరీ (ఛార్జి రూ. 1042) ఇంద్ర (రూ. 1384) సర్వీసు, పులివెందుల నుంచి సూపర్‌లగ్జరీ (రూ. 1242), మైదుకూరు (రూ. 1604), ప్రొద్దుటూరు (రూ. 1604) డిపోల నుంచి ఇంద్ర ఏసీ, జమ్మలమడుగు డిపో నుంచి సూపర్ లగ్జరీ (రూ.1352) సర్వీసులను నడుపుతున్నామన్నారు.

షిర్డీకి ప్రత్యేక బస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్: జులై 1న పౌర్ణమి సందర్భంగా ప్రొద్దుటూరు డిపో నుంచి షిర్డీకి ఇంద్ర ఏసీ బస్సును నడుపుతున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ బస్సు మధ్యాహ్నం 1.00 గంటకు ప్రొద్దుటూరులో బయలుదేరి జోగులాంబ అమ్మవారి ఆలయం, తుల్జాపూర్ భవానీమాత ఆలయం, శని సింగనాపూర్ ఆలయ దర్శనం ఉంటుందన్నారు. రాను, పోను రూ. 4600 ఛార్జిగా నిర్ణయించారన్నారు. మైదుకూరు, ఆళ్లగడ్డ, నంద్యాల, కర్నూలు నుంచి కూడా ఈ బస్సుకు రిజర్వేషన్ చేసుకునే సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.

20 నుంచి 'మెడికల్ అండ్ హెల్త్' ఉద్యోగుల బదిలీలు

కడప రూరల్: కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 (రాయలసీమ జిల్లాలు) పరిధిలో ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన బదిలీలను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 20, 21, 22 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ కేవీఎస్ఎస్ అనిల్‌కుమార్ తెలిపారు. ఈ కౌన్సెలింగ్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు.

డాక్టర్ అంబేడ్కర్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

వైవీయూ: డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రాలలో 2023-24 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కడప రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ కె. చెన్నకేశవ రెడ్డి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీలతో పాటు పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు జూలై 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. పూర్తి వివరాలకు డబ్ల్యు డబ్ల్యుడబ్ల్యు.బీఆర్ఏఓయూ.ఆన్‌లైన్.ఇన్‌తో పాటు అధ్యయన కేంద్రంలోని 7382929603 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు డీఈఓ కార్యాలయానికి హాజరుకావాలి

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో జెడ్పీ హైస్కూళ్లలో పనిచేస్తున్న హెచ్‌ఎంలకు, మండల విద్యాశాఖాధికారులకు ఎంఈఓ-2 పోస్టులు భర్తీ చేసేందుకు మార్గదర్శకాలను విద్యాశాఖ కమిషనర్ విడుదల చేశారని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు (2005 నుంచి 2012 సంవత్సరాల మధ్య పదోన్నతి పొందిన వారు) 18వ తేదీన ఉదయం 9 గంటలకు డీఈఓ కార్యాలయానికి హాజరుకావాలన్నారు. మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు తమ సర్వీసు వివరాలను నిర్ణీత ప్రొఫార్మాలో నమోదు చేసుకుని తమ సర్వీసు పుస్తకంతోపాటు రావాలన్నారు.

విద్యను ప్రోత్సహించేందుకే
జగనన్న ఆణిముత్యాలు



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఇతర అతిథులు

- కలెక్టర్ విజయరామరాజు
- టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ చూపిన 40 మందికి పురస్కారాలు

కడప సెవెన్‌రోడ్స్: విద్యను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని చేపట్టిందని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. ఇంటర్, టెన్త్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం కింద ప్రతిభా పురస్కారాల ప్రదాన కార్యక్రమం శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు తమ కళ్లెదుటే చదువుకోవాలని తల్లిదండ్రులు భావించడం సరికాదన్నారు. చదివే విద్యా సంస్థ మంచిదై ఉండాలన్నారు. ఇంటర్ తర్వాత పై చదువులను బయట చదివిస్తే విద్యార్థులకు లోకజ్ఞానం తెలిసి వస్తుందన్నారు. విద్యార్థుల జీవితంలో ఇంటర్మీడియేట్ కీలకమని, ఆ దశలో తీసుకునే నిర్ణయాలపైనే భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, ఆరోగ్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ 75 ఏళ్ల స్వాతంత్ర్యం అనంతరం విద్యార్థుల భవిష్యత్తు కోసం పనిచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలపై సీఎం దృష్టి కేంద్రీకరించి పనిచేస్తున్నారని తెలిపారు. ఈ నాలుగేళ్లలో విద్యా రంగంపై రాష్ట్ర బడ్జెట్‌లో 62 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ఘనత జగన్‌దేనన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో సైతం అమ్మ ఒడి అమలు చేస్తున్నారని చెప్పారు. ఇంటర్మీడియేట్ ఆర్ఐఓ ఎస్వీ రమణరాజు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియేట్‌లో ఉత్తమ ఫలితాలు వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. డీఈఓ రాఘవరెడ్డి మాట్లాడుతూ విద్యా రంగంపై కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ. లక్షా 20 వేల కోట్లు కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వం 32,500 కోట్లు కేటాయించడం ముదావహమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

40 మందికి పురస్కారాలు

జిల్లా స్థాయిలో పదవ తరగతికి చెందిన 26 మందికి పురస్కారాలు అందజేశారు. ఎనిమిది మంది విద్యార్థులు మొదటి బహుమతి, మరో ఎనిమిది మంది రెండవ బహుమతి, పది మంది విద్యార్థులు తృతీయ బహుమతి అందుకున్నారు. వీరిలో మొదటి బహుమతి కింద రూ. 50 వేలు, రెండవ బహుమతి కింద రూ. 30 వేలు, మూడవ బహుమతి కింద రూ. 15 వేలు ఇచ్చారు. అలాగే ఇంటర్మీడియేట్ స్థాయిలో అన్ని గ్రూపు లకు సంబంధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 14 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 50 వేలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందజేశారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్, శాలువ, జ్ఞాపికలు అందజేయడంతోపాటు నగదు బహుమతిని అతిథుల చేతుల మీదుగా ప్రదానం చేశారు. విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లను సత్కరించారు.

స్ఫూర్తినింపే కార్యక్రమం



జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం విద్యార్థుల్లో స్ఫూర్తినింపుతుంది. ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహం వల్ల పిల్లల్లో విద్య పట్ల ఆసక్తి పెరుగుతుంది. సీఎం వైఎస్ జగన్ పాఠశాలల్లో పలు పథకాలు అమలు చేస్తున్నందుకు కృతజ్ఞతలు. – ఎస్.హరిణి, ప్రొద్దుటూరు

సీఎం రుణం తీర్చుకోలేను



నేను టెన్త్‌లో 571 మార్కులు సాధించాను. జగనన్న ఆణిముత్యాల కింద పురస్కారాలు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. నన్ను ప్రోత్సహించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు. విద్యను ప్రోత్సహించేందుకు ఎన్నో పథకాలు అమలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిది. – కావ్య, సింహాద్రిపురం

చాలా సంతోషంగా ఉంది



నేను టెన్త్ క్లాస్‌లో 576 మార్కులు సాధించాను. జగనన్న ఆణిముత్యాల కింద ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నాలాంటి విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇలాంటి పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు ధన్యవాదాలు. – ఎన్.మహేష్, జమ్మలమడుగు

సీఎంకు కృతజ్ఞతలు



నేను పులివెందుల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివి 952 మార్కులు సాధించాను. ఆణిముత్యాల కింద పురస్కారాన్ని అందుకోవడం సంతోషం కలిగిస్తుంది. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాలు అమలు చేస్తున్నందుకు కృతజ్ఞతలు. – వెన్నపూస రేఖ, పులివెందుల

ఐసీడీఎస్ పీడీగా శ్రీలక్ష్మి బాధ్యతల స్వీకరణ



కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ (ఐసీడీఎస్) ప్రాజెక్టు డైరెక్టర్‌గా దేవిరెడ్డి శ్రీలక్ష్మి శనివారం బాధ్యతలు స్వీకరించారు. 2002లో పెద్దముడియం మండలంలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. 2004లో డీఎస్సీ ద్వారా ఎంపికై స్కూలు అసిస్టెంట్‌గా చాపాడు మండలంలో పనిచేశారు. అనంతరం 2006లో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. 2007లో గ్రూప్-1 పరీక్ష రాసి రాజంపేట డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్‌గా, ఆ తర్వాత కడప, నంద్యాలలో సేవలు అందించారు. 2012లో డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఆ తర్వాత 2013లో కడప కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గా, 2014లో శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా, 2016లో కడప ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా, 2019లో అన్నమయ్య అర్బన్‌డెవలప్‌మెంట్ కార్యదర్శిగా, 2022లో వైస్ చైర్మన్‌గా పనిచేస్తూ డిప్యుటేషన్‌పై ఐసీడీఎస్ పీడీగా బాధ్యతలు స్వీకరిచారు. ఈ సందర్భంగా డీసీపీఓ సుభాష్ యాదవ్, సూపరింటెండెంట్ వనజ, గాంధీ, సిబ్బంది ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గర్భిణులకు మెరుగైన చికిత్స



గర్భిణి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకుంటున్న డాక్టర్ అనిల్‌కుమార్

ఒంటిమిట్ట: గర్భిణులకు సురక్షితమైన, మెరుగైన వైద్యం అందించడంలో ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తుందని రాష్ట్ర మదర్ అండ్ చిల్డ్రన్ హెల్త్ కేర్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ కె.వి.ఎన్.ఎస్ అనిల్ కుమార్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన ఒంటిమిట్టలో గల పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న గర్భిణుల ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ వైద్యురాలు శ్వేతాతో చర్చించారు. అనంతరం ఒంటిమిట్ట కోదండ రామస్వామిని దర్శించుకున్నారు.

జగనన్న సురక్ష విజయవంతం చేయాలి

- 24 నుంచి జులై 23 వరకు సచివాలయాల పరిధిలో నిర్వహణ
- కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజా సమస్యలకు సంతృప్త స్థాయిలో పరిష్కారాలు అందించడంతోపాటు అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. శనివారం మండల స్పెషల్ ఆఫీసర్లు, కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈనెల 24నుంచి వచ్చేనెల 23 వరకు ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురించి వివరించాలన్నారు. జనన, మరణ, ఆదాయ ధృవీకరణ తదితర సర్టిఫికెట్ల జారీకి సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే తెలుసుకోవాలన్నారు. సచివాలయంలో వచ్చిన సమస్యలను పరిష్కరించాలన్నారు. డీఆర్‌డీఏ, మెప్మా, హౌసింగ్ అధికారులు ఆనంద్‌నాయక్, సురేష్‌రెడ్డి, కృష్ణయ్య, డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, శివశంకర్‌రెడ్డి, నరసింహులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

పొదుపు సంఘాల బలోపేతంతోనే అభివృద్ధి

జిల్లాలో పేదరిక నిర్మూలన, మహిళాభివృద్ధిసాధికారత పొదుపు సంఘాల బలోపేతంతోనే సాధ్యమని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. శనివారం కలెక్టరేట్ సభాభవనంలో డీఆర్‌డీఏ, మెప్మా పరిధిలో జరుగుతున్న వివిధ పనుల పురోగతిపై ఆయన క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్షించారు. అభివృద్ధి పనుల లక్ష్యాలు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. గృహ నిర్మాణ పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించినా బేస్‌మెంట్ లెవెల్ ఎందుకు దాటడం లేదని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు వారాల్లో హౌసింగ్ లక్ష్యాల్లో పురోగతి కనిపించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు స్థానిక పాల ఉత్పత్తిదారుల ద్వారానే పాలు సరఫరా చేయాలన్నారు. చేయూత పథకం ద్వారా రుణాలు అందించి మహిళా పాడి రైతులకు ప్రోత్సహించాలన్నారు.

వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో నేరుగా ప్రవేశాలు

- ఏడీసెట్-2023 రద్దు చేస్తూ అధికారుల నిర్ణయం
- దరఖాస్తు చేసుకున్నవారికి కౌన్సిలింగ్ ద్వారా ప్రవేశాలు

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించాల్సి ఉన్న ఏడీసెట్-2023 (ఆర్ట్ అండ్ డిజైన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్)ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ఏడీసెట్-23 చైర్మన్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్, కన్వీనర్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి శనివారం తెలిపారు. విశ్వవిద్యాలయంలోని బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ కోర్సులో భాగంగా పెయింటింగ్, స్కల్ప్చర్, ఆనిమేషన్, అప్‌లైడ్ ఆర్ట్స్, ఫొటోగ్రఫీ, బి.డిజైన్ (ఇంటీరియర్ డిజైన్) కోర్సుల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 20న నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు అభ్యర్థులకు తగినంత సమయం ఇచ్చామన్నారు. అయితే కొన్ని విభాగాల్లో ఆశించిన మేర దరఖాస్తులు రాకపోవడంతో, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ మేలు చేయాలన్న ఉద్దేశంతో ఏడీసెట్-23ని రద్దు చేసి, డైరెక్ట్ అడ్మిషన్లు నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ వారి అర్హత మార్కులు (ఇంటర్మీడియట్/డిప్లొమా), రోస్టర్, మెరిట్ ఆధారంగా నేరుగా ఆయా కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రవేశాల ప్రక్రియకు సంబంధించిన షెడ్యూలును వచ్చేవారంలో విడుదల చేసి పదిరోజుల్లోపు ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. దరఖాస్తు చేసిన ప్రతి అభ్యర్థికి సంబంధిత సమాచారాన్ని ఫోన్ ద్వారా, పత్రికల ద్వారా తెలియజేస్తామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

కొనసాగిన న్యాక్ పరిశీలన

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో న్యాక్ టీం పరిశీలన రెండోరోజూ కొనసాగింది. శనివారం న్యాక్ పీర్ కమిటీ చైర్మన్, సీఎస్‌జేఎం విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య నీలి మాగుప్తా నేతృత్వంలో ఆచార్య లక్ష్మీహరిబండి, రెహమాన్ షరీఫ్ అక్తర్ బేగంలు సభ్యులుగా గల బృందం కళాశాలలోని విద్యార్థినుల వసతిగృహాలను, ఐక్యూఏసీ విభాగాలతో పాటు మహిళా సాధికారత విభాగం, జేకేసీ, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ తదితర విభాగాలను పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుబ్బలక్షుమ్మ, అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు.

యువతి అదృశ్యం

ముద్దనూరు : మండలంలోని చౌటిపల్లె గ్రామానికి చెందిన కృష్ణవేణి(18) అనే యువతి అదృశ్యమైనట్లు శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ నరేష్ బాబు సమాచారం మేరకు.. కృష్ణవేణి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదివి ప్రస్తుతం ఇంటి వద్ద వుంది. ఇంటి వద్ద పనులు చేయడం లేదని శుక్రవారం తల్లిదండ్రులు కృష్ణవేణిని మందలించారు. శుక్రవారం రాత్రి ఇంటిలోనే నిద్రించిన ఆమె శనివారం ఉదయం తల్లిదండ్రులు నిద్రలేచి చూడగా కనిపించలేదు. దీంతో యువతి తల్లి రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

జమ్మలమడుగు రూరల్ : క్యాన్సర్ వ్యాధి సోకడంతో జీవితంపై విరక్తి చెందిన పేరం నారాయణమ్మ (68) ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సలివెందుల గ్రామంలో చోటు చేసుకొంది. సలివెందుల గ్రామానికి చెందిన పేరం నారాయణమ్మ గత కొంత కాలం క్యాన్సర్ వ్యాధితో తిరుపతిలో చికిత్స పొందింది. అయినా ఫలితం లేకపోవడంతో శనివారం ఇంట్లో కుటుంబ సభ్యులు లేని సమయంలో గ్రామంలో ఉన్న చెరువులో పడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు స్థానికుల సాయంతో చెరువులో ఉన్న నారాయణమ్మను తీసి చూడగా అప్పటికే మృతి చెందింది. నారాయణమ్మ కుమారుడు వెంకటేశ్వరరెడ్డి శనివారం జమ్మలమడుగు పట్టణ పోలీసులకు సమాచారం అందించాడు.

నాన్నే నా హీరో!

నేడు ఇంటర్నేషనల్ ఫాదర్స్ డే



కడప కల్చరల్ : జీవితంతో విడదీయలేని బంధం నాన్న. ఆయన లేని మన పుట్టుకను, జీవితాన్ని ఊహించుకోలేం. తల్లితో కలిసి ఆయన బిడ్డల అభివృద్ధికి పడే తపనను ఎవరూ వర్ణించలేరు. బిడ్డలు దినదినాభివృద్ధి చెందుతుంటే గుండెలనిండా సంతోషంతో పొంగిపోయే వ్యక్తి 'నాన్న'. దేవుని తర్వాత అంతటిస్థానం అమ్మతోపాటు నాన్నకూ ఉంది. అమ్మను మమతానురాగాలకు ప్రతిరూపంగా భావించే మనం.. నాన్నను మాత్రం భయపెట్టే వ్యక్తిగా భావిస్తూ ఉంటాం. నిజానికి కుటుంబ పెద్దగా తన బాధ్యతల పట్ల తండ్రి బాధ్యత ఏమిటీ? స్పందన ఎలా ఉంటుందన్న విషయం చర్చించేందుకే ప్రతి సంవత్సరం జూన్ 3వ ఆదివారం తండ్రుల దినోత్సవంగా నిర్వహిస్తున్నాం.

పెద్ద దిక్కు

అమ్మ మనకు ఉనికినిస్తే...నాన్న విలువ కల్పిస్తాడు. అమ్మ నవమాసాలు మోసి సంతానాన్ని, ఇంటిని చక్కదిద్దేందుకు కృషి చేస్తే నాన్న పెద్దదిక్కుగా ఆ తల్లీబిడ్డలతోపాటు మొత్తం కుటుంబానికి రక్షణగా నిలుస్తాడు. అమ్మకు కష్టం వస్తే నాన్నకు చెప్పుకుంటుంది. కన్నీరు పెట్టుకుని గుండె బరువు దించుకుంటుంది. కానీ తండ్రికి ఆ అవకాశం కూడా ఉండదు. ఇంటా, బయటా ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా తండ్రి ఆ బాధను గుండెల్లోనే దాచుకుంటాడు. ఎంతో మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యం పాలవుతాడు. అందుకే పక్షవాతం, హెమరేజ్, గుండెపోటు లాంటి వ్యాధులు ఎక్కువగా పురుషులకే వస్తాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. కుటుంబం కోసం నాన్న కొవ్వొత్తిలా కరిగిపోతుంటాడు. చివరి వరకు వెలుగునిచ్చేందుకే ప్రయత్నిస్తాడు.

కుటుంబ పెద్దగా...

సమాజంలో కుటుంబానికి పెద్దగా తండ్రి పాత్ర ముఖ్యమైనది. తల్లి ఇంటిని, సంతానాన్ని కాపాడుకుంటే తండ్రి సమాజంలో తన కుటుంబాన్ని ఉన్నత స్థాయికి తెచ్చేందుకు ఇంటా బయటా ఆ స్థాయిని నిలిపేందుకు అహరహం కృషి చేస్తుంటాడు. అటు ఆర్థికంగా, ఇటు నైతికంగా కుటుంబానికి గౌరవ స్థానం కల్పించేందుకు తపిస్తాడు. తాను పడ్డ కష్టాలు తన సంతానం పడకూడదని భావించి వారికి అన్ని సౌకర్యాలు, సౌఖ్యాలు అందేలా జాగ్రత్త పడతాడు. పిల్లలు సైతం తండ్రిని సూపర్ హీరోగా భావిస్తారు. యవ్వనంలోకి వచ్చాక వారికి నాన్న ఓ ఎన్‌సైక్లోపీడియాగా కనిపిస్తాడు. వాళ్లు ఆర్థికంగా జీవితంలో స్థిరపడ్డాక నాన్న ఏం తెలియని అమాయకుడనిపిస్తాడు. వాళ్లు నాలుగు రాళ్లు వెనకేసుకున్నాక ఆ కుటుంబంలో తండ్రిపాత్రకు క్రమంగా ప్రాధాన్యత తగ్గుతుంది. వృద్ధురాలైన తల్లి కంటే తండ్రిని ఓ అడ్డుగా భావించే సంతానం కూడా లేకపోలేదు. తమ కృషి ఫలించి పిల్లలు మంచి స్థానంలో స్థిరపడితే తండ్రి ఎంతో గర్వంగా భావిస్తాడు. నలుగురికి చెప్పుకుని ఆనందిస్తాడు. పిల్లా పాపలతో తన కష్టానికి ఫలితంగా ఆనందించాలని ఆశిస్తాడు. కానీ పిల్లలు వ్యసన పరులైతే లేదా తాను ఆశించిన స్థాయికి చేరుకోలేక కష్టాలు పడుతుంటే మౌనంగా ఆవేదన చెందుతాడు. దుఃఖాన్ని బయటికి కనిపించనీయకుండా మౌనంగా భరిస్తాడు.

ఆశ్రమాలలో..

తల్లిదండ్రులు వృద్ధులైతే, వారికి సంపాదన లేకపోతే వారి సంతానం పెద్దలు బరువనిపించి వృద్ధాశ్రమాల పాలు చేస్తున్నారు. తల్లిని పనిచేసేందుకైనా ఇంటిలో ఉండనిస్తారు గానీ తండ్రిని మాత్రం ఇంట్లో అడ్డుగా భావించే సంతానం కూడా లేకపోలేదు. నిజానికి ఓ సర్వే ప్రకారం జిల్లాలో 30 దాకా వృద్ధుల ఆశ్రమాలు ఉన్నాయి. వీటిలో ఎక్కువ మంది వృద్ధ మహిళలే ఉన్నారు. పురుషుల సంఖ్య తక్కువే. కుటుంబాన్ని ఓ దశకు తెచ్చేందుకు సంతానానికి ఓ ఆదరువు ఇచ్చేందుకు తండ్రి పడే తపన అంతా ఇంతా కాదు. తన శక్తియుక్తులన్నింటినీ పిల్లల అభివృద్ధికే ఖర్చు చేస్తాడు. దీంతో శారీరకంగా వారు అలిసిపోతారు. ఒక అంచనా ప్రకారం పాతికేళ్లుగా 55 నుంచి 65 సంవత్సరాలలోపే తండ్రులు మరణిస్తున్నారు. కుటుంబ సమస్యలతో పురుషులు ఎక్కువ ఒత్తిడిని అనుభవిస్తారు. ఫలితంగా రక్తపోటు, షుగర్, గుండెపోటు, పక్షవాతం, ఎమెరేజ్ లాంటి వ్యాధుల బారిన పడుతున్నారు. దీంతో పురుషులు మృత్యువాత పడుతుండగా వృద్ధమాతలు జీవచ్ఛవాల్లా ఆశ్రమాలకు చేరుకుంటున్నారు. అందుకే వృద్ధాశ్రమాల్లో సగటున వృద్ధ మహిళలు 60 శాతం ఉండగా, వృద్ధులు 40 శాతం మాత్రమే ఉన్నారు.

జిల్లాలోని వృద్ధుల ఆశ్రమాలు	30కి పైగా
వీటిలో పెయిడ్ ఆశ్రమాల సంఖ్య	05
ఆశ్రమాల్లో ఉంటున్న మొత్తం వృద్ధుల సంఖ్య	1000కి పైగా
సగటున మహిళలు	60 శాతం
పురుషులు	40 శాతం

వైఎస్సార్ పశు బీమా చేసుకోండి



మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శారదమ్మ

కడప అగ్రికల్చర్ : జిల్లా వ్యాప్తంగా పశువులు, ఆవులు కలిగిన రైతులు వైఎస్సార్ పశు బీమా పథకాన్ని చేయించుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ సూచించారు. వైఎస్సార్ పశుబీమా పథక ప్రచారంలో భాగంగా శనివారం సికెదిన్నె మండలంలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి ఎద్దులకు, దున్నలకు, పందులకు కూడా బీమా చేయించుకునే అవకాశం వచ్చిందన్నారు. రైతలందరూ తమ దగ్గరలోని రైతు భరోసా కేంద్రంలోని అసిస్టెంట్ పశు వైద్యాధికారిని కలసి బీమా చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమణయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీధర్‌లింగారెడ్డి, పశువైద్యాధికారి నాగరాజుయాదవ్ పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు తాపించాలి

జిల్లా వ్యాప్తంగా ఉన్న గొర్రెలు, మేకలకు వాటి యజమానులు నట్టల నివారణ మందును తాపించాలని జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి శారదమ్మ పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఈ నెల 15వ తేదీ నుంచి నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం ప్రారంభం అయ్యిందన్నారు. ఇందులో భాగంగా శనివారం జిల్లాలోని సికెదిన్నె మండలం కాపంల్లి గ్రామంలో ఆమె నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన సేవలందించాలి



పరికరాల అమరికపై ఫిట్టర్లకు శిక్షణ ఇస్తున్న ఎంఐ ఇంజినీర్లు

కడప అగ్రికల్చర్ : క్షేత్ర స్థాయిలో ఏర్పాటు చేసే డ్రిప్పు, స్ప్రింక్లర్ల ఏర్పాటులో రైతులకు నాణ్యమైన సేవలను అందించాలని ఏపీ సూక్ష్మ సేద్య సాగు పథక జిల్లా ప్రాజెక్టు అధికారి రవీంద్రనాథరెడ్డి ఎంఐ కంపెనీ ఫిట్టర్లకు సూచించారు. శుక్రవారం ఏపీఎంఐపీ పరికాలకు సంబంధించి డ్రిప్పు, స్ప్రింక్లర్ల అమరికపై కంపెనీ ఫిట్టర్లకు కడపలోని ఏపీ ఎంఐపీ కార్యాలయ ఆవరణలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంఐ ఇంజినీర్లు శ్రీనివాసులు, ఫణీంద్రబాబు పొలాల్లో పరికరాలను ఏ విధంగా బిగించాలి, పరికరాల నిర్వహణ, వాటి ఉపయోగం గురించి ఫిట్టర్లకు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రనాథరెడ్డి మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా 10,500 హెక్టార్ల లక్ష్యాన్ని నిర్దేశించారన్నారు. క్షేత్ర స్థాయిలో నాణ్యతగా పని చేస్తేనే మన సేవలను రైతులు పూర్తిగా పొందగలుగుతారన్నారు. పరికరాల అమరికలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. ఈ సంవత్సరం కూడా అవసరమున్న ప్రతి రైతుకు సూక్ష్మ సేద్యాన్ని అందించి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ మురళీమోహన్ రెడ్డి, ఎంఐ ఇంజనీర్లు, ఎంఐ డీసీలు, ఎంఐ ఏఓల తోపాటు ఎంఐ కంపెనీ ఫిట్టర్లు పాల్గొన్నారు.

బీటెక్ రవి.. శవ రాజకీయాలు మానుకో

వైఎస్సార్‌సీపీ సింహాద్రిపురం మండల నాయకులు



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు

సింహాద్రిపురం : టీడీపీ నాయకుడు బీటెక్ రవి శవ రాజకీయాలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, బ్రహ్మనందరెడ్డి, బాబురెడ్డిలు హితవు పలికారు. శనివారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు.అంకాలమ్మ గూడూరు గ్రామంలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన సంఘటనలో భాగంగా ఒకరు చనిపోతే దాన్ని రాజకీయం చేయడం తగునా అని ప్రశ్నించారు. అన్నదమ్ముల్లా కలిసి ఉన్న పచ్చని పల్లెల్లో అమాయకులను రెచ్చగొట్టి వారి మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి కోసం పబ్బం గడపాలనుకోవడం బీటెక్ రవి మనస్తత్వానికి నిదర్శనమన్నారు. పల్లెలు ప్రశాంతంగా ఉండటం ఆయనకు అసలు నచ్చడం లేదన్నారు. రైతులు, గ్రామస్తులందరూ కలిసి మెలసి ఎవరి పని వారు చేసుకుంటుంటే బీటెక్ రవి లాంటి వారు ఉనికి కోల్పోతామని, పల్లెల్లో టీడీపీ జాడ లేకుండా పోతుందని భయపడుతున్నారన్నారు. అందుకే పచ్చని పల్లెల్లో చిచ్చుపెట్టి చలి మంట కాచుకోవడం టీడీపీ వారికే చెందిందన్నారు. కులం, మతం, వర్గం, ప్రాంతం ఏదీ చూడకుండా చట్టం తన పని తాను చేసుకునిపోయే ప్రజల ప్రభుత్వం వైఎస్ జగన్ ప్రభుత్వం అన్నారు. అంకాలమ్మగూడూరులో సంఘటన జరిగిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసి అరెస్టులు కూడా చేసి అప్రమత్తంగా వ్యవహరించారన్నారు. ఎక్కడ ఎవరు చనిపోతారా..దాన్ని ఏ రకంగా రాజకీయంగా వాడుకోవాలా అనే దుర్బుద్ధితో శవాల వద్దకు రాబందుల్లా చేరి శవ రాజకీయాలు చేసే నీచ నికృష్ట రాజకీయం టీడీపీ వారిదన్నారు. అంకాలమ్మ గూడూరులో కృష్ణయ్య అనే దళితుడు ఓ సంఘటనలో చనిపోవడం బాధాకరమన్నారు. మృతుని కుమారుడు అరవింద్ వైఎస్సార్ గ్రామ వార్డు మెంబర్ అని, కానీ జరిగిన దుర్ఘటనను అందరూ ఖండించాల్సిందేనన్నారు. అయితే బీటెక్ రవి మాట్లాడే పద్ధతి, రెచ్చగొట్టే విధానం, శవ రాజకీయాలు చేయడం చూస్తేంటే ఇలాంటి చీడ పురుగులకు రాజకీయంగా పుట్టగతులుండవన్నారు. ఇప్పటికే పులివెందులలో టీడీపీ పరిస్థితి బాగోలేదని.. లోకేష్‌తో చెడామడా చీవాట్లు తిన్న తర్వాత ఏం చేయాలో తెలియని పరిస్థితిలో ఏదో ఒక సంఘటనను అడ్డం పెట్టుకుని రాజకీయం చేసి లోకేష్ వద్ద మార్కులు కొట్టేయాలనే టీడీపీ నేత దుర్బుద్ధికి అంకాలమ్మ గూడూరు ఘటనే నిదర్శనమని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నర్సిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సర్వేశ్వరరెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దమ్ముంటే ప్రొద్దుటూరు నుంచి పోటీ చెయ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు క్రైం : సినీగ్లామర్‌తో రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా పోటీ చేసి గెలుస్తానని భావించే పవర్ స్టార్ పవన్‌కల్యాణ్ దమ్ముంటే ప్రొద్దుటూరు నుంచి పోటీ చేయాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి సవాల్ విసిరారు. ప్రొద్దుటూరు నుంచి పోటీ చేయడానికి పవన్‌కల్యాణ్‌ను సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడికి వచ్చి పోటీ చేస్తే పవన్‌ను ఓడించి తీరుతానని ఎమ్మెల్యే రాచమల్లు తెలిపారు. ప్రొద్దుటూరులోని మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో శనివారం ఎమ్మెల్యే విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 10 రోజుల రోజుల ముందు తాను సీఎం అభ్యర్థిని కానని, ప్రభుత్వ ఓటును చీలకుండా ఉండేందుకు మాత్రమే ఉపయోగపడతానని పవన్ కల్యాణ్ చెప్పినట్లు ఎమ్మెల్యే గుర్తు చేశారు. అయితే 10 రోజుల తర్వాత నేను సీఎం అభ్యర్థిని, నాకు ఒక అవకాశం ఇవ్వండని ప్రజలను పవన్ కల్యాణ్ కోరారన్నారు. ఒక స్థిరమైన అభిప్రాయం లేకుండా 10 రోజులకు ఒక సారి తన అభిప్రాయాన్ని మార్చుకునే పవన్ కల్యాణ్‌కు రాష్ట్రానికి నాయకత్వం వహించే యోగ్యతా ఉందా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు.

బాబు సలహా మేరకే మాట మార్చావా..!

పవన్‌కల్యాణ్ తాను సీఎం అభ్యర్థిని కాదని చెబితే తన అభిమానులు, సామాజిక వర్గానికి చెందిన వారు ఓటు వేయరేమోనని చంద్రబాబునాయుడు సలహా మేరకు మళ్లీ మాట మార్చాడని ఎమ్మెల్యే అన్నారు. చంద్రబాబు ప్రజలను మోసం చేస్తే.. పవన్‌కల్యాణ్ జనసేన సైనికులను మోసం చేస్తున్నాడని చెప్పారు. 175 స్థానాల్లో పోటీ చేసేవాడు సీఎం అభ్యర్థి లేక 30 స్థానాల్లో మాత్రమే పోటీ చేసే వ్యక్తి సీఎం అభ్యర్థా అని ప్రశ్నించారు. ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి కావడానికి మ్యాజిక్ ఫిగర్ 88 ఎమ్మెల్యే సీట్లని అన్నారు. అయితే పవన్ కల్యాణ్ కనీసం 88 సీట్లలో తన అభ్యర్థులను పోటీలో నిలపడం లేదని తెలిపారు. టీడీపీతో పొత్తు పెట్టుకోబోతున్న పవన్‌కు 30-40 సీట్లు ఇస్తారని, అందులో కనీసం 5-6 సీట్లు గెలవడం కూడా కష్టమన్నారు. పవన్ తన ప్రసంగాల్లో ఎక్కడా రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి మాట్లాడలేదని, అర్థపర్థం లేని చిల్లర మాటలు మాట్లాడుతున్నాడని ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. చెప్పుతో కొడతానని చెప్పు సంస్కృతికి శ్రీకారం చుట్టింది పవన్ కల్యాణ్ అని అన్నారు. తాను రౌడీనని, చెప్పుతో కొడతానని, ఎంతకైనా తెగిస్తానని పదే పదే మాట్లాడే వ్యక్తి సీఎం అభ్యర్థికి అర్హుడు ఎలా అవుతాడని ఎమ్మెల్యే ప్రశ్నించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో స్వర్ణకారుడు మృతి



సలీం (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని ఇస్లాంపురం వీధికి చెందిన షేక్ సలీం (45) అనే స్వర్ణకారుడు శనివారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. సలీం కొంత కాలం నుంచి స్వర్ణకారుడిగా పని చేస్తున్నాడు. అతను బంగారు ఆభరణాలకు మెరుగులు దిద్దుతుంటాడు. ఇటీవల అనారోగ్యంతోపాటు ఆర్థిక సమస్యలు కూడా ఎక్కువయ్యాయి. దీంతో తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో సాయంత్రం ఇంట్లో అపస్మారక స్థితిలో పడిపోవడంతో కుటుంబ సభ్యులు స్థానికుల సాయంతో జిల్లా ఆస్పత్రికి చేర్పించారు. అయితే అతను అప్పటికే మృతి చెందినట్లు వైద్యుడు తెలిపారు. కాగా సలీం సైనైడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. అతనికి భార్య షాబిరాతో పాటు జాఫర్ అనే కుమారుడు, సబిహా అనే కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు.

అతిగా మద్యం సేవించి..

ప్రొద్దుటూరులోని కేహెచ్‌ఎం స్ట్రీట్‌కు చెందిన కరిముల్లా (41) అనే వ్యక్తి అతిగా మద్యం సేవించి మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. కరిముల్లా బేల్దారి పనికి వెళ్తుంటాడు. అతనికి మూర్ఛ వ్యాధి కూడా ఉంది. తరచూ మద్యం సేవించి రాత్రి సమయంలో రాయల్ ఫంక్షన్ హాల్ సమీపంలో పడుకొని తిరిగి ఉదయం ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో శనివారం ఉదయమైనా కరిముల్లా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా చనిపోయి ఉన్నాడు. ఆస్పత్రికి తీసుకెళ్లి చూపించగా చనిపోయినట్లు డాక్టర్ తెలిపాడు. అతిగా మద్యం సేవించి అతను మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. భార్య గౌషియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు.

బ్రిడ్జి రక్షణ గోడను ఢీకొన్న బైక్

కొండాపురం : మండల పరిధి లావనూరు సమీపంలోని డంప్ యార్డ్ వద్ద శనివారం బ్రిడ్జి రక్షణ గోడను ఢీకొన్న ప్రమాదంలో రాచమల్లు సుధాకర్‌రెడ్డి(52) మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. పైడిపాళెం గ్రామానికి చెందిన రాచమల్లు నారాయణరెడ్డి కుమారుడు రాచమల్లు సుధాకర్‌రెడ్డి కొండాపురం నుంచి తన సొంత గ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గంమధ్యలో లావనూరు గ్రామ సమీపంలోని ఉపాధి హామీ డంప్ యార్డ్ వద్ద రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడ ఉంది. ఈ గోడను ఢీకొట్టాడు. దీంతో అతను వంకలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు.

చికిత్స పొందుతూ..

చాపాడు : మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన భూమిరెడ్డి పుల్లారెడ్డి(57) అనే వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. పుల్లారెడ్డి కూతురు ఇటీవల ప్రసవం కోసం పుట్టిల్లు అయిన విశ్వనాథపురం గ్రామానికి వచ్చింది. ఈ క్రమంలో మద్యం అలవాటు ఉన్న పుల్లారెడ్డి రోజూ తాగి ఇంటికి వచ్చి కుటుంబీకులను వేధిస్తుండేవాడు. ఈ నెల 12న మద్యం సేవించి భార్యతో గొడవ పడగా పుల్లారెడ్డిని మందలించింది. ఈ కారణంతో గ్రామ శివారులో పొలాల్లోకి వెళ్లి పుల్లారెడ్డి పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. బాధితుడిని కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆకాశవాణి శతవసంతాలు చేసుకుంటుంది

– ఘనంగా కడప ఆకాశవాణి 60 ఏళ్ల సభ



మాట్లాడుతున్న జానమద్ది విజయభాస్కర్

కడప కల్చరల్ : ఆకాశవాణి కడప కేంద్రం షష్టి పూర్తి చేసుకోవడం శుభపరిణామమని, ఇది శతవసంతాలు పూర్తి చేసుకుంటుందని తనకు ప్రగాఢ విశ్వాసం ఉందని సీపీ బ్రౌన్ గ్రంథాలయ సలహా మండలి సభ్యులు, ఏపీజీబీ రిటైర్డ్ మేనేజర్ జానమద్ది విజయభాస్కర్ అన్నారు. 60 వసంతాల కడప ఆకాశవాణి కేంద్రం ప్రస్థానం పేరిట శనివారం కడప నగరంలోని ఆకాశవాణి కార్యాలయ ప్రాంగణంలో ఉద్యోగులు, నగర ప్రముఖులు, ఆకాశవాణి అభిమానులతో సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తమతండ్రి డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రితోపాటు మహాకవి పుట్టపర్తి నారాయణాచార్యులు, మరికొందరు నాటి ప్రముఖులు ఆకాశవాణి ఉన్నతికి ఉద్యమించారని గుర్తు చేశారు. సీమ రైతులు, కళాకారులు, మేధావుల ఆలోచనలను నలుగురికి తెలిపిన ఆకాశవాణి సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శారద మాట్లాడుతూ రేడియో వినడమే ఓ ఎడ్యుకేషన్ అని భావించి అభిమానులుగా మారామన్నారు. ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ ఎ.విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ నిన్న, మొన్నటి తరాలకు ఆకాశవాణితో గల బంధాన్ని వర్ణించలేమన్నారు. ఆకాశవాణి కడప కేంద్రం పూర్వ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉన్నత స్థాయి ప్రతిభావంతులు ఈ కేంద్రం ప్రతిష్టను కాపాడారని, జాతీయ అవార్డును కూడా సాధించిందని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్ ఎన్.జయసింహ, ఆకాశవాణి సిబ్బంది ఆదినారాయణరెడ్డి, గౌరీశంకర్, రవికుమార్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా జానపద గాయని ఓటు సుబ్బమ్మ జానపద గీతాన్ని ఆలపించి అందరినీ అలరించారు.

జనం సొమ్ము రూ. 23 కోట్లతో పరారీ

పోరుమామిళ్ల : జనం సొమ్ము రూ.23 కోట్లు దండుకుని కనిపించకుండా పోయిన ఓ వ్యక్తి గురించిన ఫిర్యాదు శనివారం పోలీస్‌స్టేషన్‌కు అందింది. వివరాలిలా ఉన్నాయి. కాశినాయన మండలం కోడిగుడ్లపాడుకు చెందిన లక్ష్మిశెట్టి చిన్న ఓబులేసు చీటీలు వేస్తూ, వడ్డీలకు డబ్బులిస్తూ జనం సొమ్ము రూ.23 కోట్లు వసూలు చేసుకుని నాలుగు రోజుల నుంచి కనిపించకుండా పోయినట్లు తెలిసింది. లక్ష నుంచి కోటి రూపాయల దాకా చీటీలు వేసినట్లు, పాట పాడుకున్న వారికి బాండు రాయించి ఆ డబ్బు తాను తీసుకునే వాడని తెలిసింది. పైకి బాగా కనిపించేందుకు 2 కార్లు, 2 బుల్లెట్ బైక్‌లు, హోండా యూనికార్న్ బైక్‌తోపాటు మెరిసే బంగారు ఆభరణాలతో టిప్‌టాప్‌గా తిరుగుతుండటంతో అందరూ మోసపోయారు. రెండు రోజులుగా ఫోన్ స్విచ్చాఫ్ వస్తుంటే అందరూ గాబారా పడ్డారు. వెతికితే ఆచూకీ దొరకలేదు. పోలీసుల విచారణలో పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.